## మైనార్టీ బాలుర వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్ 5, (ప్రభాతవార్త) :**
రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని పోస్ట్ మెట్రిక్ మైనార్టీ బాలుర వసతి గృహంలో ఇంటర్, ఆ పై చదువుతున్నా మైనార్టీ బాలురులు ప్రవేశం పొందడానికి ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధరకాస్తు చేసుకునే విద్యార్థుల తండ్రి వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతంలో ఉన్నవారు అయితే రూ. 2లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల వారు అయితే రూ. ఒక లక్ష 50వేల లోపు ఉండాలని వారు సూచించారు. ధరఖాస్తుకు ఈ నెల 15వ తేది చివరి తేది అని, ఆ లోపు విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త

## ఆల్ ఇండియా సర్వీసెస్ ఆఫీసర్స్ క్షేత్రస్థాయి పర్యటన ముగింపుపై సమీక్ష

**- జిల్లా కలెక్టర్ ఆమోయ్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం**



సమీక్ష సమావేవం నిర్వహిస్తున్న కలెక్టర్ అమోయ్‌కుమార్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్ 5, (ప్రభాతవార్త) :**
గత నెల 31 నుంచి నవంబర్ 5వ తేది వరకు ఐదు రోజుల పాటు ఆల్ ఇండియా సర్వీసెస్ ఆఫీసర్స్ క్షేత్రస్థాయిలో పర్యాటన నిర్వహించారు. 14 మంది సివిల్ సర్వీస్ అధికారులు ఐదు రోజుల పాటు యాచారం మండలంలోని గున్‌గల్, కొత్తూరు మండలంలోని పెంజర్ల, మంచాల్ మండలంలోని ఆరుట్ల గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అధ్యయనం, ప్రజల జీవన విధానం వంటి అంశాలను సివిల్ సర్వీస్ అధికారులు ఫౌండేషన్ కోర్సు కింద పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆల్ ఇండియా సర్వీసెస్ ఆఫీసర్స్ క్షేత్రస్థాయి పర్యాటన ముగింపుపై జిల్లా కలెక్టర్ ఆమోయ్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు ఆయా అధికారులు గ్రూపులుగా గ్రామాలలో బస చేసి ఆధ్యయనం చేసిన అంశాలపై పరిశీలనలు, ప్రజల అభిప్రాయాలు, కావాలసిన సౌకర్యాలు వంటివి కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో వ్యవసాయం, రైతు బంధు, మిషన్ భగీరథ, ఆరోగ్యం, హరితహారం, పల్లె ప్రగతి, అంగన్‌వాడీల పనితీరు వంటి అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ హరితహారం కార్యక్రమం కింద జిల్లాలో మొక్కలు నాటి సంరక్షించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఉన్న 558 గ్రామ పంచాయతీలలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, పిడి డీఆర్డీఏ ప్రభాకర్, కొత్తూరు ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఆర్టీసీలో టిమ్స్ చోరుడు

**✷18 మిషన్లు ఎత్తుకెళ్లిన కండక్టర్ ✷బస్సుల్లో ప్రయాణికులకు దొంగ టిక్కెట్లు**
**✷జేబులో వేసుకున్న మొత్తం రూ.3 లక్షలపై మాటే ✷అధికారులను బురిడీ కొట్టించిన వైనం**
**✷వికారాబాద్ డిపోలో ఇద్దరు అధికారుల సస్పెన్షన్**




పట్టుబడిన టిమ్స్ మిషన్

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
ప్రయాణికులకు ఇచ్చే టిక్కెట్ డబ్బులను నొక్కేయాలని ఓ కండక్టర్‌కు దురాశ పుట్టింది. ఆర్టీసీకి చేరాల్సిన డబ్బును తన జేబుల్లో వేసుకోవాలని దుర్బుద్ధి కలిగింది. ఇంకేం.. తన పథకాన్ని ఆచరణలో పెట్టేశాడు. టిక్కెట్ ఇష్యూ మిషన్ (టిమ్స్)లనే చోరీ చేశాడు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 18 టిమ్స్ మిషన్లను తన ఇంటికి చేరవేశాడు. నిన్నమొన్న కాదు, ఏకంగా రెండు, మూడేండ్లుగా టిమ్స్ మిషన్ల ద్వారా దొంగ టిక్కెట్లను ప్రయాణీకుల చేతుల్లో పెట్టి అడ్డగోలుగా డబ్బులు జేబుల్లో వేసుకున్నాడు. అయితే, దొంగతనం ఏనాటికైనా బయటపడుతుందనే లాజిక్ మిస్సయిన ఈ కండక్టర్ ఎట్టకేలకు అధికారులకు చిక్కాడు. ఒకటి రెండు రోజుల్లో కటకటాలకు వెళ్లేందుకు సిద్ధమైనాడు. విధి నిర్వహణలో విఫలమైన ఇద్దరు కిందిస్థాయి అధికారులను సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు ఇంకా డిపో అధికారులకూ సంజాయిషీ నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ సంఘటన వికారాబాద్ ఆర్టీసీ డిపోలో వెలుగు చూసింది. డిపోలో పనిచేస్తున్న కండక్టర్ రమేష్ (ఈ274094) కొంతకాలంగా టిమ్స్ మిషన్లను చోరీ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వాస్తవానికి ప్రతి డిపోలో బస్సులకు సమానంగా టిక్కెట్ ఇష్యూ మిషన్లను ఏర్పాటు చేసిన సంస్థ యాజమాన్యం అదనంగా మరో 10శాతం మిషన్లను స్పేర్‌లో ఏర్పాటు చేస్తుంది. ఈ డిపోలో మైక్రో ఎఫెక్ట్స్, క్వాంటమ్ కంపెనీల మిషన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజూ డ్యూటీకి వెళ్లే కండక్టర్లకు మిషన్లను అందజేస్తారు. నిత్యం మిషన్‌లను ఓనెన్ చేసి ఇస్తారు. క్లోజింగ్ టైమ్‌లో డబ్బులతో పాటు మిషన్లను డిపోకు అప్పగించడం కండక్టర్ల బాధ్యత. టిక్కెట్ల, రోజూ వారీ కలెక్షన్ల వివరాలను కూడా అప్పగిస్తారు. ప్రతి రోజు ఓపెనింగ్, క్లోజింగ్ టిక్కెట్ల వివరాలను స్టాటిక్ రిటర్న్స్ (ఎస్ఆర్)లో కండక్టర్లు రాయాలి. అయితే, మన కండక్టర్ రమేష్ హైదరాబాద్ మార్గంలో డ్యూటీలు ఎక్కువగా చేస్తుంటాడు. రోజూ వచ్చే కలెక్షన్‌లపై ఓ అంచనాకు వచ్చాడు. హైదరాబాద్ వెళ్లేటపుడు ప్రయాణికులకు ఇచ్చే టిక్కెట్ల ఒరిజినల్‌గా, రిటర్న్‌లో వచ్చేటపుడు డూప్లికేట్ టిక్కెట్‌లు ఇచ్చి అటు సంస్థకూ, ఇటు తనకూ ఫిఫ్టీ ఫిఫ్టీ లాభాలు పంచుకుందామని ప్లాన్ వేశాడు. తరచూ డిపోలో స్పేర్‌లో ఉన్న టిమ్స్ మిషన్లను చోరీకి పాల్పడ్డాడు. డిపో అధికారులు ఇచ్చిన మిషన్‌తో పాటు తాను చోరీ చేసిన మిషన్‌ను వెంట తీసుకువెళ్లడం ప్రారంభించాడు. అలా ఏకంగా 18 మిషన్లను తస్కరించాడు. హైదరాబాద్ వెళ్లే సమయంలో ప్రయాణికులకు సంస్థ టిమ్స్ ద్వారా టిక్కెట్లు ఇస్తూ వచ్చాడు. తిరుగు ప్రయాణంలో తన టిమ్స్ ద్వారా డూప్లికేట్ టిక్కెట్లు ఇవ్వడం మొదలు పెట్టారు. అలా రెండు, మూడేండ్లుగా నిరాటంకంగా దందా నిర్వహించాడు. అయితే, ఓ లాజిక్ మిస్సయిన కండక్టర్ రమేష్ చివరకు దొరికిపోయాడు. హైదరాబాద్ వెళ్లే టైమ్‌లో మాత్రమే ఎస్ఆర్‌లో వివరాలు రాసి తిరుగు ప్రయాణంలో ఒక్క ప్రయాణీకుడు కూడా ఎక్కలేదని జీరో వివరాలు పెడుతూ వచ్చాడు. ఇన్నాళ్లూ అనుమానం రాని డిపో అధికారులు చివరకు మిషన్లు కనిపించకుండా పోవడంతో అనుమానం వచ్చి ప్రతి కండక్టర్ ఎస్ఆర్‌లను చెక్ చేశారు. తీరా ఈ కండక్టర్ ఎస్ఆర్‌పై అనుమానం రావడంతో గట్టిగా నిలదీశారు. తానే టిమ్స్ మిషన్లు దొంగిలించినట్లు అంగీకరించాడు. ఆర్టీసీ అధికారులు సదరు కండక్టర్ ఇంట్లో తనిఖీ చేయగా 10 మిషన్లు లభ్యమైనాయి. వాటిని స్వాధీనం చేసుకుని డిపోకు తరలించారు. మిగిలిన 8 మిషన్లను బావిలో పాడేసినట్లు కండక్టర్ సంబంధిత అధికారుల ముందు వాంగ్మూలం ఇచ్చారు. ఈ మూడేండ్ల కాలంలో సుమారు 3 లక్షల రూపాయల వరకు అతని జేబుల్లో వేసుకున్నట్లు అంచనా. అయితే అధికారులు మాత్రం రూ.1.80 వేలు తస్కరించాడని చెబుతున్నారు. సదరు కండక్టర్ వద్ద రూ.60 వేలు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన డబ్బులను నెలవారీ వేతనం ద్వారా రికవరీ చేస్తామని చెబుతున్నారు.

**ఇద్దరు అధికారుల సస్పెన్షన్ : రీజినల్ మేనేజరు**
విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన డిపో క్లర్క్ (ఎర్నింగ్), సిస్టమ్ సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేసినట్లు రంగారెడ్డి రీజినల్ మేనేజరు శ్రీధర్ తెలిపారు. బాధ్యుడైన కండక్టర్‌పై వికారాబాద్ డిపో మేనేజరు పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా డిపో స్థాయి అధికారులకూ సంజాయిషీ నోటీసులు ఇస్తామని, సరైన వివరణ తీసుకుంటామని తెలిపారు. ఇలా ఉండగా ఈ వ్యవహారంపై ఆర్టీసీ విజిలెన్స్ విభాగం అధికారులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

## ఐరన్ ఫ్యాక్టరీ వద్దని రైతుల ధర్నా



రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్థులు...

**కొందుర్గు, నవంబర్ 5, (ప్రభాతవార్త) :**
పచ్చని పంట పొలాల మధ్య ద్వారకా ఐరన్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దని నిరసిస్తూ పరిసర గ్రామాల రైతులు ధర్నా నిరహార దీక్ష చేశారు. శనివారం నాడు మండల పరిధిలోని రాంచంద్రాపూర్ చౌరస్తాలో పులుసు మామిడి,రాంచంద్రాపూర్, మహాదేవ్‌పూర్, పర్వతాపూర్ గ్రామాల రైతులు తమ గ్రామాల శివారులో గల సర్వే నెంబర్లు 37, 38, 39, 40లలోని భూముల్లో నిర్మించ తలపెట్టిన ద్వారకా ఐరన్ ఇండస్ట్రీ వదిలే వ్యర్థాల వలన కాలుష్యం ఏర్పాడుతుందని ఇక వ్యవసాయం చేయలేమని వెంటనే యాజమాన్యం ఫ్యాక్టరీ ఏర్పాటును ఉప సంహరించుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉన్న స్కాన్ ఐరన్ ఫ్యాక్టరీ, బట్టల ఫ్యాక్టరీల వలన కాలుష్యం అయ్యిందని, పంటలు నల్లబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.తాము వ్యవసాయమే జీవనాధారం చేసుకొని బ్రతికే వాళ్లమని, ఇక మరో ఐరన్ ఫ్యాక్టరీ ఏర్పాటు అయితే ఇక తమ బ్రతుకు ప్రశ్నార్థకమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల 31న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతి రావు పర్యావరణాధికారిణి సంగీతలకు సైతం ఇక్కడ ఐరన్ ఫ్యాక్టరీ నిర్మాణాం చేయొద్దని వేడుకున్నామని రైతులు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అపివేసి న్యాయం చేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ రెడ్డి నర్సింలు, న్యాయవాది దర్గా నర్సింలు, రైతులు చిన్నయ్యగౌడ్ దర్గా వెంకటేష్, శరణప్ప, శేఖర్‌గౌడ్, రుక్మొద్దీన్, మీరాపురం వెంకటయ్య, యాదయ్య, రాజాశేఖర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, పిచ్చికుంట్ల రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**-మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్**
**-కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 5, ప్రభాతవార్త**
జిల్లాలో అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ స్పష్టం చేశారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాకు సంబంధించిన ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నియోజకవర్గ అభివృద్ధి నిధులతో పాటు ఎంపి ల్యాడ్స్, స్పెషల్ డవలప్‌మెంట్ నిధులతో పాటు ఇతర అభివృద్ధి నిధులకు సంబంధించి పనులు పంచాయతీరాజ్,ఆర్అండ్‌బి, వాటర్ వర్క్స్, జిహెచ్‌ఎంసి, ఇరిగేషన్ రూరల్, డిఆర్‌డిఎ, డిడబ్ల్యుఓ, జడ్పీ, మండలాల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశంను నిర్వహించారు. దీనిలో ఇప్పటి వరకు జరిగిన ఆయా పథకాలు,అభివృద్ధి పనులు,నిధులు వాటిపై సమగ్ర వివరాలను వాటి పురోగతిని ఒక్కో శాఖ అధికారి నుంచి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు వచ్చిన నిధులు, చేపట్టిన పనుల వివరాలను సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగ కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగ అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని, నిధులు కూడ ప్రభుత్వం అందజేస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు లేవని నిర్లక్ష్యం చేయకుండ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వారిని కలెక్టర్ ఆదేశించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నిధులు మంజూరు ఉండి పనులు పూర్తికాకుంటే వాటిని ఆ పనులను పూర్తి చేయాలన్నారు. వచ్చే సమావేశం వరకు అధికారులు అందరు సమగ్ర సమాచారంతో అన్ని వివరాలతో సంసిద్ధులై రావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, సిపిఓ మోహన్‌రావు, జడ్పీసిఇఓ దేవ సహాయం, డిపిఓ రమణమూర్తి, ఆర్‌అండ్‌బి ఈఈ శ్రీనివాస్‌మూర్తి, పిఆర్ ఈఈ రాంమోహన్‌రావు, డిఆర్‌డిఓ పద్మజారాణి, డిఇఓ విజయకుమారి, జిల్లా సంక్షేమ అధికారిణి పావని, డిఎఫ్ఓ జోజీ, జిల్లావాటర్ వర్క్స్ అధికారి, జిహెచ్‌ఎంసి అధికారి, రూరల్ ఇరిగేషన్ అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, ఆయా మండలాల ఎంపిడిఓలు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జిల్లా అభివృద్ధి పనులపై జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరీశ్,పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, సంబంధిత అధికారులు

## పిల్లల రక్షణ కోసం టిడి వ్యాక్సిన్ వేయించాలి

**-మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్**
**-కలెక్టరేట్‌లో జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీ సమావేశం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 5, ప్రభాతవార్త**
వ్యాధుల నుంచి పిల్లలను రక్షించేందుకు ప్రభుత్వం సూచించిన విధంగ నిర్లక్ష్యం చేయకుండా వ్యాక్సిన్స్ (టీకాలు) తప్పకుండా వేయించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ సూచించారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్సు కమిటీతో పాటు ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ పది సంవత్సరాలు, 16సంవత్సరాల వయసు ఉన్న వారందరికి టెటనస్ అండ్ డిప్తీరియా (టిడి) వ్యాక్సిన్లు ఇప్పించాలన్నారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీ సోమవారం నుంచి 19వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చేపట్టటం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగ 1,43,801మంది విద్యార్థులు ఉండగ, అందులో 1,512మంది పాఠశాలలో చదివే విద్యార్థులు, 1,232మంది డ్రాప్‌అవుట్స్ ఉన్నారన్నారు. పది సంవత్సరాల వయసు గల వారు 57,450మంది, 16సంవత్సరాల వయసు గల విద్యార్థులు 49,627మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలోని 5వ తరగతి, 10వతరగతి చదువుతున్న పాఠశాలల విద్యార్థులందరికి అలాగే ఇప్పటి వరకు ఎవరైతే టెటనస్ అండ్ డిప్తీరియా (టిడి) వ్యాక్సిన్ టీకాను వేయించుకోలేదో గుర్తించి వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తి



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరీశ్, పాల్గొన్న అదనపు కలెక్టర్ జాన్‌శ్యాంసన్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, అధికారులు

చేయాలని సమావేశంలో కలెక్టర్ అధికారులకు సూచించారు. పది,పదహారు సంవత్సరాల పిల్లలందరికి ఖచ్చితంగ వ్యాక్సినేషన్లు అందించాలని, సోమ, మంగళ,గురు, శుక్రవారంలలో రెండు వారాల పాటు జిల్లాలోని అందరికి టీకాలు వేయించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్, మైనార్టీ స్కూల్స్‌తో పాటు బడి బయట ఉన్న వారికి కూడ వ్యాక్సినేషన్ చేయాలని కలెక్టర్ సూచించారు. దీనిలో వైద్య,ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, సాంఘీకసంక్షేమశాఖ, మైనార్టీశాఖ,మహిళా,శిశు సంక్షేమశాఖల అధికారులు,సిబ్బంది బృందంగ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు,ఆశవర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు ఒక టీమ్‌గా ఏర్పడిత జిల్లాలో 270 బృందాలు ఉంటాయని, ఒక్కో టీమ్ ప్రతి రోజు 250మందికి టెటనస్, అండ్ డిప్తీరియా వ్యాక్సిన్స్ ఇవ్వాలన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగ ఈ నెల 7వ తేదీ నుంచి 19వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ జాన్ శ్యాంసన్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ సరస్వతి, డాక్టర్ రాంకుమార్, డిప్యూటీ డిఎంఅం డ్‌హెచ్‌ఓలు డాక్టర్ ఆనంద్, డాక్టర్ నారాయణరావు, జిల్లా మాస్‌మీడియా అధికారి జి.వేణుగోపాల్ రెడ్డి, డిఇఓ విజయకుమారి, జడ్పీసిఇఓ దేవస హాయం, డిపిఓ రమణమూర్తి, డిఆర్‌డిఓ పద్మజారాణి, జిల్లా సంక్షేమ అధికా రులు ఝాన్సీరాణి, పావని, ఆయా శాఖల అధికారులు,పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**- విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

**మహేశ్వరం, నవంబర్ 5, (ప్రభాతవార్త) :**
ప్రజలు తమ దినచర్యలో ఆధ్యాత్మిక భావాలు కలిగి దైవందిన జీవితంలో కొనసాగాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి శనివారం తుక్కుగూడ పురపాలక సంఘంలోని శ్రీ సాయి సన్నిధి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సాయి ద్వితీయ వార్షికోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతన కలిగి మానసిక ప్రశాంత కలుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవార్చుకోవాలని ఆమె కోరారు. ప్రజలు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఆధ్యాత్మిక భావనతో ధర్మ కార్యక్రమాల్లో పాల్గొని సమాజానికి మేలు జరిగే విధంగా పూజలు, యజ్ఞ యాగాలు వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె తెలిపారు. సామాజిక బేదాలకు అవకాశం ఇవ్వకుండా మన ధర్మాన్ని సమైఖ్యతను చాటి చెప్పాలని సమత భావన కలిగి ఐక్యమత్యంతో జీవించాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక, ధార్మిక అంశాలు మన ధర్మాన్ని సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుతాయన్నారు. సాయిబాబ ద్వితీయ వార్షికోత్సవాలను అత్యంత వైభవంగా జరిపారు. ద్వితీయ వార్షికోత్సవానికి తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రావిరాళ్ల, మంకాల, సర్దార్‌నగర్, వాసవగూడ తాండ, శ్రీనగర్, ఇమామ్‌గూడ గ్రామాలతో పాటు మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి అనేక మంది హాజరై సాయిబాబను దర్శించుకున్నారు. సాయిబాబ ఆలయం చైర్మన్, తుక్కుగూడ మాజీ సర్పంచి కొమిరెడ్డి



సాయిబాబ ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భవానివెంకట్‌రెడ్డి, మహేశ్వర మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు స్నేహసురేష్, మున్సిపల్ కమీషనర్ వసంత, కౌన్సిలర్లు రెడ్డిగళ్ల సుమాన్, రవీనాయక్, స్థానిక టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, రావిరాళ్ల మాజీ సర్పంచి బాట సురేష్, శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంబయ్యయాదవ్, ఈ.మల్లేష్‌యాదవ్, ఎం. పాండునాయక్, జనార్ధన్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో కౌశిక ద్వాదశి ప్రత్యేక పూజలు

**కొడంగల్,నవంబర్ 5ప్రభాతవార్త :**
పేదల పెన్నిదిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కౌశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం 5గంటలకు సుప్రభాతం అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి ఉత్సవం ఏరేగించారు.స్వామివారికి విశేష అలంకరణలతో ఆలయ ప్రాంగణంలో భక్తుల కొలహాలం మద్య ఊరేగించారు.ఉత్సవం అనంతరం ఆస్దాన మండపంలో వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించి కౌశిక పురాణం విశిష్టతను భక్తులకు వివరించారు.శ్రీఉగ్ర శ్రీనివాస మూర్తి సంవత్సరంలో ఒకరోజు మాత్రమే బయటకు రావడం జరుగుతుందన్నారు.సూర్యోదయానికి ముందే ఉత్సవం నిర్వహించి స్వామివారిని తిరగి దేవాలయంలోకి తీసుకొని వెళ్ళారు.తిరుమల తిరుపతి దేవస్దానంలో జరిగే విధంగా కొడంగల్ శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో కౌశిక ద్వాదశి విశేష పూజలు నిర్వహించడం విశేషమన్నారు.అలాగే ఉదయం 7:45 గంటలకు శ్రీవేంకటేశ్వర స్వామి వారి మూలమూర్తికి విశేషంగా పాలు,పెరుగు,తేనే,కొబ్బరినీరు,పసుపు,చెందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు ఘనంగా జరిగాయి.ప్రత్యేక పూజలకు కొడంగల్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణలతో మారుమ్రోగింది.



ఆలయ ప్రాంగణంలో ఊరేగుతున్న శ్రీవారు

## శనీశ్వర స్వామిని దర్శించుకున్న ప్రకాష్ గౌడ్



శనీశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే, తదితరులు

**శంషాబాద్ నవంబర్5,ప్రభాతవార్త :**
శంషాబాద్ మండలం మదనపల్లి గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ శనీశ్వర స్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమానికి రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు.సిరిగిరి పీఠం చైర్మన్ శంకర రాజు ముఖియ కోయదొర నేతృత్వంలో శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు.పూజా కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి,మున్సిపల్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దూడల వెంకటేష్ గౌడ్,జడ్పిటిసి నీరటి తన్వీరాజు ముదిరాజ్,మున్సిపల్ చైర్పర్సన్ కొలను సుష్మామహేందర్ రెడ్డి,ఎంపిపి జయమ్మ శ్రీనివాస్,వైస్ ఎంపిపి నీలం మోహన్ నాయక్,మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు దండు ఇస్తారి,మదనపల్లి కొత్త తండా సర్పంచ్ కోర్ర దేవా నాయక్, తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.హూమగుండంలో పూజా సామాగ్రిని వేసిన అనంతరం స్వామివారికి తైలాభిషేకం చేశారు.

## ముచ్చింతల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

### -ఎమ్మెల్యేను కలిసిన రాఘవేందర్

**శంషాబాద్ నవంబర్5,ప్రభాతవార్త :**
శంషాబాద్ మండలంలోని ముచ్చింతల గ్రామపంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ ఆ గ్రామ టిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్కు వినతిపత్రం అందజేశారు.శంషాబాద్ మండలం బిఆర్ఎస్ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో 9వ వార్డు సభ్యులు కల్పనా సామెల్ పాలమాకుల కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ రాఘవేందర్,పార్టీ నాయకులు సాకలి వెంకటేష్,భానురి శివశంకర్,కడల శేఖర్,అల్లం జనార్దన్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి నిధులు కేటాయించాలని కోరారు.సిసి రోడ్డుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని నిధులు మంజూరు చేయిస్తాని ప్రకాష్ గౌడ్ హామీ ఇవ్వడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**తలకొండపల్లి నవంబర్5,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండలం వీరన్న పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో 150 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా పలువురు గ్రామ అభివృద్ధి కొరకై సహకరించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ను అభినందించారు.ఆయన వెంట గ్రామస్థులు ఉండి ఆయన తీసుకునే ప్రతి నిర్ణయంలో ముందు ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి,సురేష్ రెడ్డి,సర్పంచ్ నాగమణి లింగం గౌడ్,వైస్ ఎంపిపి మేక శ్రీనివాస్ రెడ్డి,వార్డు మెంబర్లు మీన్నాల జంగమ్మ,బెక్కరి లక్ష్మారెడ్డి,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘ వేందర్,మేక భరత్ రెడ్డి,కడారి శ్రీకాంత్ బండారు పాండు,మిన్నాల వినయ్,రఘుపతిరెడ్డి,మిన్నాల వెంకటయ్య,బోయ కిషన్,గ్రామస్థులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపేటలోనే పెన్షన్లు ఇవ్వాలి : సర్పంచ్



పెన్షన్ డబ్బుల కోసం కూర్చున్న వృద్ధాల దృశ్యం

**తలకొండపల్లి నవంబర్5,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండలం ఉమ్మడి వెంకట్రావుపేట గ్రామపంచాయతీకి సంబంధించిన సుమారు 200 మంది వృద్ధాప్య పెన్షన్ల కోసం ప్రతి నెల 3 కిల్లోమీటర్ల దూరంలో ఉన్న గట్టుఇప్పలపల్లి గ్రామానికి నడిచి వెళ్లాల్సి వస్తుందని సర్పంచ్ కెంచ హైమావతి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వృద్ధులు 3 కిలోమీటర్ల నడవలేక చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని పోస్ట్ ఆఫీస్ సిబ్బందిని అడగగ మాకు వెంకట్రావుపేట గ్రామంలో సిగ్నల్ వస్తలేదు కాబట్టి గట్టుఇప్పలపల్లి గ్రామంలో ఇస్తున్నామని సమాధానం చెప్తున్నారని కాబట్టి మా గ్రామంలో పెన్షన్లు ఇచ్చే విధంగా పోస్ట్ ఆఫీస్ అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సదర్ ఉత్సవాలను విజయవంతం చేయండి

**జిల్లెడు చౌదరిగూడ, నవంబర్ 5,(ప్రభాతవార్త):**
షాద్నగర్ పట్టణంలో ఆదివారం నిర్వహిస్తున్న సదర్ ఉత్సవాలను విజయవంతం చేయాలని అఖిల భాతర కురుమ యాదవ సంఘం మండల అధ్యక్షుడు కొండి యాదయ్య శనివారం ఒక ప్రకటనలో పెర్కొన్నారు. జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాల్లో గల కురుమ యాదవులు సదర్ ఉత్సవాలకు హాజరు కావాలని ఆయన సూచించారు. ఆదివారం సాయంత్రం ఉత్సవాలు ప్రారంబమవుతాయని ఆయన పెర్కోన్నారు. కురుమ యాదవులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివమౌళి, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## పార్కుల అభివృద్ధే ధ్యేయం : చైర్మన్

- పార్కులను ప్రారంభించిన నాయకులు,అధికారులు



**నాగారం నవంబర్5,ప్రభాతవార్త :**
మున్సిపాలిటీ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పేర్కొన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని 5వ.వార్డు ఓం సాయి నగర్లో 8.10 లక్షల రూపాయలతో నిర్మించిన చిల్డ్రన్స్ పార్క్,జేడి ఎంక్లేవేలోని 6,40 లక్షల రూపాయలతో నిర్మించిన త్రి పార్కులను శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో పార్కులను దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు.అనంతరం శిల్పానగర్లోని పార్కును కూరగాయల మార్కెట్ యార్డు పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్ ,కమిషనర్ వాణిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్,కౌన్సిలర్ అన్నంరాజు సుమిత్ర సురేష్,డిఈ రఘు,ఓం సాయి నగర్ కాలనీవాసులు వెంకటేశ్వర్ రావు, వెంకట్ రావు,బ్రహ్మ రెడ్డి,అప్ప రావు,రాజు,కృష్ణ రావు,జేడి ఎనక్లేవ్ కమిటీ సభ్యులు వెంకట్,రాముడు,శంకర్,తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్లో ధూమ్ ధామ్గా సదర్ వేడుకలు

### -ఆకట్టుకున్న దున్న రాజుల విన్యాసాలు



సదర్లో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు

**శంషాబాద్ నవంబర్ 5,ప్రభాతవార్త :**
శంషాబాద్ పట్టణంలోని కృష్ణ టెంట్ హౌస్ వద్ద శుక్రవారం రాత్రి సదరు ఉత్సవాలను ధూంధాంగా నిర్వహించారు.యాదవ సంఘం అధ్యక్షుడు నాన్న వాళ్ల కుమార్ యాదవ్ ,యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో షాద్నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్,క్యామ మల్లేష్ యాదవ్, ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.యాదవులు ప్రతి ఏటా నిర్వహించే సదర్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా సదరు ఉత్సవాలు నిర్వహించారు.వేదిక చుట్టూ విద్యుత్ దీపాలను అలంకరించి దున్న రాజుల విన్యాసాలను తిలకించారు.మున్సిపల్ పరిధిలోని పలు వార్డులతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుండి దున్న రాజులను అందంగా అలంకరించి డప్పు వాయిద్యాలు వాయిస్తూ ఊరేగింపుగా తీసుకువచ్చారు.దున్న రాజులను చూడడానికి వచ్చిన వందలాది మంది ప్రజలతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్,క్యామ మల్లేష్ యాదవ్,డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్,ఐలబోయిన రమేష్ యాదవ్, గుర్రంపల్లి శ్రీనివాస్ యాదవ్,బండి గోపాల్ యాదవ్,బండి శ్రీకాంత్ యాదవ్, హమిదుల్లా నగర్ సర్పంచ్ సతీష్ యాదవ్,కవ్వగూడ సర్పంచ్ దేవరకొండ రమేష్ యాదవ్,తోకల మురళి యాదవ్,నాగేష్ యాదవ్,కృష్ణ యాదవ్,వంశీ యాదవ్,శేఖర్ యాదవ్,దన్నాడ వెంకటయ్య యాదవ్,జ్ఞానేశ్వర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# మురుగు నీటిలోపడి చిన్నారి మృతి చెందడం బాధకరం

### - బిజెపి నియోజకవర్గ ఇంఛార్జీ శ్రీవర్ధన్రెడ్డి.
### -మున్సిపల్ తీరుపై మండి పడ్డా బిజెపి నాయకులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

**షాద్నగర్, నవంబర్ 5, (ప్రభాతవార్త) :**
షాద్నగర్ మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డులో కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ వెనుక భాగంలో ఉన్న మురుగు నీటి కాలువలో వలస కార్మికుడు నిసార్ కుమారుడు పడి చనిపోవడం చాలా బాధకరమైన విషయమని బీజేపీ నియోజకవర్గ ఇంఛార్జీ శ్రీవర్ధన్రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ నాయకులు మున్సిపల్ నిర్లక్ష్యా వైఖరిని తప్పుబట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇండ్ల మధ్యలో ఇలాంటి మురుగు కాలువలను మున్సిపల్ పట్టించుకోకపోవడం విడ్డురంగా ఉందని అన్నారు. వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చెందుతుందని ప్రగాల్భలు పలుకుతున్న షాద్నగర్ మున్సిపల్ పాలక మండలి, అధికారుల నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలిఅయిపోయిందని వారు మండిపడ్డారు. షాద్నగర్లో మున్సిపల్కు వేల రూపాయలు పన్నులను కడుతున్నారని, కేంద్రం నిధులు ఇస్తుంటే ఈ డబ్బు ఎక్కడ ఖర్చు పెడుతున్నారని వారు ప్రశ్నించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకనే నేడు చిన్నారి బాబు మృతి చెందాడని వారు పేర్కొన్నారు. ఇప్పటికైన మున్సిపల్ పాలక మండలి ప్రజల కోసం పని చేయాలని, సమస్యలను వెంటనే పరిష్కారించాలని వారు హెచ్చరించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం బీజేపీ నియోజకవర్గ ఇంఛార్జీ శ్రీవర్ధన్రెడ్డి మున్సిపల్ కమీషనర్కు ఫోన్ చేసి సంఘటన గురించి ప్రశ్నిస్తే వారు వారి తప్పును కప్పిపుచ్చుకోవడానికి పిల్లల తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని అనడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కమీషనర్కు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు అందెబాబయ్య, విష్ణువర్ధన్రెడ్డి, మల్చాలం మురళీ, చెట్ల వెంకటేష్, శ్యాం సుందర్రెడ్డి తదితరులు ఉన్నారు.

# గురుకుల పాఠశాలలో అవినీతి నిర్మూలనపై అవగాహన

### -అవినీతి నిర్మూలన కోసం నాటక ప్రదర్శనలు, క్విజ్ పోటీలు నిర్వహణ



**మొయినాబాద్ నవంబర్ 5, ప్రభాతవార్త :**
మొయినాబాద్ మండలంలోని తోల్కట్ట గ్రామ పరిధిలోని చేవెళ్ల గురుకుల బాలికల స్వేచ్ఛాపాఠశాల అక్టోబర్ 31 2022 నుండి నవంబర్ 6 వరకు అవినీతి నిర్మూలన అవగాహన వారోత్సవాలు జరగనున్నాయని పలువురు అన్నారు, అందులో భాగంగా అవినీతి నిర్మూలన కార్యాక్రమాన్ని విద్యార్థులతో నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా యూసివో బ్యాంక్ జోనల్ అధికారులు మోతిలాల్, అసిస్టెంట్ జనరల్ డిప్యూటీ జోనల్ మేనేజర్ కిర్తి కాంత్ రెడ్డి, సినియర్ మేనేజర్ రామక్రిష్ణ, సినియర్ మేనేజర్, జోనల్ ఆఫీసర్ సంగారెడ్డి బ్రాంచ్ శవిభూషన్ రావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బి. శ్రీహరిలు హాజరైయ్యారు, ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు, ప్రిన్సిపల్ రమాదేవి మరియు ఉపద్యాయులు, విద్యార్థులు అందరు కలిసి పౌరుల సమగ్రత ప్రతిజ్ఞను ఆలపించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు, అవినీతి పై అవగాహన కల్పిస్తు వివిధ రకాల నాటక ప్రదర్శనలు, ఉపన్యాసాలు విద్యార్థులను ఉద్దేశించి ఇవ్వడం జరిగింది, అవినీతి నిర్మూలన అవగాహనకు సంబందించిన ప్రశ్నలతో విద్యార్థులకు క్విజ్ పోటిలను నిర్వహించడం జరిగింది. పోటీలో విజయం సాధించిన విద్యార్దులకు ప్రతమ, ద్వితియ, బహుమతులను అందజేశారు, జోనల్ అధికారి బి.శ్రీహరి మాట్లాడతూ బ్యాంక్ గురించి అందులోని ఎన్నిరకాలుంటాయో, భ్యాంకుల్లో ఇచ్చే రుణాల విదానాల గురించి విద్యార్థులకు తెలియజేశారు, వచ్చిన అతిధిలు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతి గూర్చి మాట్లాడడం జరిగింది. యూసివో బ్యాంకు సంగారెడ్డి బ్రాంచ్ తరుపున పాఠశాలకు వాటర్, కూలర్, వాటర్ ఈటర్ బహుకరించారు. ప్రిన్సిపల్ రామాదేవి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతి గురించి అనైతిక కార్యక్రమాల గురించి తెలియజేస్తు వాటిని ఎలా అధికమించాలో విద్యార్దులకు తెలియజేశారు, విద్యార్థుల కోసం వచ్చిన అతిధిలకు ప్రిన్సిపల్ అభినందనలు తెలిపారు. ప్రత్యేకంగా యూసివో బ్యాంకు వారికి గురుకులాల కార్యదర్శి రోనాల్డ్ రోస్ ఫోన్ద్వార వారికి అభినందనలు తెలిపారు.

## 7 తేదీ నుండి 19 వరకు టిడి వ్యాక్సినేషన్



**మొయినాబాద్ నవంబర్ 5, ప్రభాతవార్త :**
మొయినాబాద్ మండలంలోని విద్యార్థులకు 10 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల వయసుగల బాల,బాలికలకు టిడి వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం మొయినాబాద్ మండల ఎంపీడీవో కార్యాలయంలో టీడి వ్యాక్సినేషన్ కార్యాక్రమంలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు మండల విద్యాదికారుల ఆధ్వర్యంలో లైన్ డిపార్ట్ మెంట్ అధికారులతో మండల టాస్క్ ఫోర్స్ సమావేశం ఏర్పాటుచేశారు, ఈ సందర్భంగా వారు మట్లాడుతూ నవంబర్ 7వ తారీఖు నుండి 19 తేది వరకు విద్యాకార్యాలయాలలో 10 నుండి 16 సంవత్సరాల వయసు గల బాల, బాలికలకు ధనుర్వాతం, కంఠసర్పి మొదలగు వ్యాదుల బారిన పడకుండా టిడి వ్యాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందని మండల పరిధిలో 10 నుండి 16 సంవత్సరాల వయసు కలిగిన బాల,బాలికలు 4099 మంది కి టీడి వ్యాక్సినేషన్ ఇవ్వడం కోసం ప్రణాళిక తయారుచేశామని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎమ్వో డా.ఏ వాణి, సూపర్ వైసర్ సునీత, తదితర వైద్య సిబ్బంది, మరియు అంగన్వాడీ సిబ్బంది తధితరులు పాల్గోన్నారు,

## లక్ష్మారావుగూడ గ్రామాన్ని ఆదర్శపంచాయతీగా తీర్చిదిద్దుతాం

**షాబాద్, నవంబర్ 5, ప్రభాతవార్త :**
లక్ష్మారావుగూడ గ్రామానికి అవసరమైనన్ని నిధులు అందజేసి, ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామని జడ్పీటీసీ పట్నం అవినాష్రెడ్డి తెలిపారు. శనివారం లక్ష్మారావుగూడలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మాణానికి త్వరలోనే అవసరమైనని నిధులు సమకూర్చుతామన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిత, ఎంపీటీసీ సీతారామస్వామి, నాయకులు నక్క శ్రీనివాస్గౌడ్, మద్దూరి మల్లేష , బండ శ్రీకాంత్గౌడ్, మల్లారెడ్డి, నర్సింహ్మారెడ్డి, మల్లన్న, నాగిరెడ్డి, నాగేందర్రెడ్డి, కుమార్, శ్రీకాంత్రెడ్డి, గోపాల్, శ్రీరామ్, వెంకట్రెడ్డి, గ్రామస్థులు తదితరులు ఉన్నారు. ఆశాభావం వ్యక్తం చేశారు.



లక్ష్మారావుగూడలో పర్యటిస్తున్న జడ్పీటీసీ పట్నం అవినాష్రెడ్డి

## ఘనంగా కార్తీకమాస పూజలు

### -రేపు అన్నదాన కార్యక్రమం



ఎదులాబాద్లోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి

**ఘట్కేసర్, నవంబర్ 5, ప్రభాతవార్త:**
ఘట్కేసర్ మండలం ఎదులాబాద్లోని శ్రీభ్రమరాంబమల్లికార్జునస్వామి దేవాలయంలో కార్తీకమాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. కార్తీకం సందర్భంగా భక్తులు ఉదయమే ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కార్తీకమాసంలో ఇక్కడ ప్రతి సోమవారం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు ధర్మకర్తలు తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేస్తుండగా సాయంత్రం ఆలయ ఆవరణలో మహిళా భక్తులు కార్తీక దీపాలను వెలిగించి భక్తిని చాటుకుంటున్నారు. ఘట్కేసర్ మున్సిపల్ వద్ద హరిహరభవాని క్షేత్రం, లింగాలకుంట శ్రీనాగలింగేశ్వరస్వామి, శివారెడ్డిగూడలోని శ్రీపసన్నవీరాంజనేయ మల్లికార్జునస్వామి, ఎన్ఎఫ్సీ నగర్ శ్రీవిశ్వేశ్వరగిరి క్షేత్రం తదితర ఆలయాల్లో కార్తీక పూజలు నిర్వ హిస్తున్నారు.

## సంస్కృతిలో ఉత్సాహంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన



కొండాపూర్ సంస్కృతి కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

**ఘట్కేసర్, నవంబర్ 5, ప్రభాతవార్త:**
ఘట్కేసర్ మున్సిపల్ కొండాపూర్లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశ కార్యక్రమంలో భాగంగా మూడవరోజు విద్యార్థులు నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రామ్స్ ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ నృత్య, గాన, వాయిద్య, సంగీత ప్రదర్శన, వర్ధమాన నృత్యాలు, గీతాల ఆలాపాన తదితర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈకార్యక్రమంలో డైరక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జె.గోవర్ధన్, అకాడమిక్ డీన్ కె.శివకేశవరెడ్డి, కన్వీనర్-విభాగాధిపతి డాక్టర్ ఎం.రాజేశ్వర్రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారం కోసం 13న చలో హైదరాబాద్



**శంషాబాద్ నవంబర్5,ప్రభాతవార్త :**
రాష్ట్రంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహించిన తలపెట్టినట్లు వివరించారు.రైతు గర్జన కార్యక్రమం వాల్ పోస్టర్ శంషాబాద్ మండలంలోని చిన్న గోల్కొండ గ్రామంలో ఆవిష్కరించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు నేరవేర్చాలని రైతులకు 1లక్షల రూపాయల రుణ మాఫీ అమలు చేయాలి,పంటల భీమా పతాకాన్ని కొనసాగించాలని,రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.తప్పు చేసిన ప్రభుత్వ అధికారులను శిక్షించాలని ,ధాన్యం తూకం వేసిన వెంటనే వ్యవసాయ సొసైటి వద్దనే రశీదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్,బాల్ రెడ్డి,అర్జున్,నర్సింహ,గణేష్,కృష్ణారెడ్డి,దేవేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## సిద్దేశ్వర కాలనీలో మంచినీటి పైప్లైన్ పనులు ప్రారంభం



పైప్లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్పర్సన్,తదితరులు

**శంషాబాద్ నవంబర్5,ప్రభాతవార్త :**
మున్సిపల్ పరిధిలోని సిద్దేశ్వర కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైప్లైన్ ఏర్పాటు పనులను మున్సిపల్ చైర్పర్సన్ కొలను సుష్మమహేందర్ రెడ్డి,వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్,శనివారం ప్రారంభించారు.బస్తీ వాసులకు రక్షిత మంచినీటిని అందించడం కోసం నూతన పైపులైన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.నిర్మాణ పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా నాణ్యత లోపించకుండా పనులు చేపట్టాలని వారు సూచించారు.హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ మేనేజర్ హసీనా,సిద్ధేశ్వర కాలనీ నాయకుడు చదువుల రామస్వామి ,తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు నిర్మాణంలో ఇళ్లు పోయిన బాధితులకు స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతి పత్రం అందజేస్తున్న రుద్రారం గ్రామస్థులు

**షాబాద్, నవంబర్ 5, ప్రభాతవార్త :**
రోడ్డు నిర్మాణంలో ఇండ్లు పోయిన బాధితులకు స్థలం కేటాయించాలని రుద్రారం గ్రామస్థులు శనివారం చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. షాబాద్ మండల పరిధిలోని నాగర్గూడ నుంచి రుద్రారం వరకు డబుల్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న తరుణంలో రుద్రారం గ్రామంలో సుమారు 20 ఇండ్లు రోడ్డు వైడింగ్లో కోల్పోతున్న తరుణంలో గ్రామంలోని సర్వే నెం. 116లో ప్రభుత్వ భూమిలో ఇండ్లు కోల్పోయిన బాధితులకు 1గుంట భూమిని ఇచ్చి డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ పట్నం అవినాష్రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్రెడ్డి, గ్రామస్థులు యాదిరెడ్డి, సంజీవరెడ్డి, నర్సింలు, సురేందర్, నర్సింలు, షబ్బీర్, మాణిక్యం, మల్లమ్మ తదితరులు ఉన్నారు.

## చేవెళ్ళ వెంకటేశ్వర స్వామి దేవాలయం భూమి కబ్జా

### -చేవెళ్ళ సహకార సంఘం మాజీ చైర్మన్ దేవర శ్రీధర్రెడ్డి



చేవెళ్ళ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం భూమి కబ్జా చేసి అక్రమంగా కట్టాడాలు చేవడతున్న దృశ్యం

**చేవెళ్ల, నవంబర్ 5, ప్రభాతవార్త**
చేవెళ్ళ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాయం భూమిని కబ్జా చేస్తున్నారని చేవెళ్ళ సహకార సంఘం మాజీ చైర్మన్ దేవర శ్రీదర్రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ళ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ వెంకటేశ్వస్వామి దేవాలయంకు చేందిన భూమిని అయ్యప్ప స్వాములు కబ్జా చేసి కట్టడాలు చేపడుతున్న సంబందిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. దేవాలయం, ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలుతీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తున్న దేవయం భూమి కబ్జా చేశారన్నారు. అయ్యప్పదేవాయలం పక్కన గల దేవాలయం భూమిని స్వాముల పెరుతో కబ్జా చేసి కట్టడాలు కూడ చేపడుతున్నారన్నారు. దేవాయలం భూమిని కబ్జా నుండి విడిపించాలని అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాల్సిన దేవాలయం భూమిని కబ్జా చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కబ్జాకు గురైన భూమిని విడిపించకుంటే పెద్ద ఎత్తున అందోళన చేస్తామన్నారు.

## శంకర్పల్లి మున్సిపల్ అభివృద్ధికి పాటుపడుతా

**శంకర్పల్లి, నవంబర్ 5, ప్రభాతవార్త :**
శంకర్పల్లి మున్సిపల్ అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి పాటుపడుతానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. గురువారం శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని సింగపూర్ 1,9,10 వార్డులతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను మున్సిపల్ చైర్పర్సన్ సాత విజయలక్ష్మిప్రవీణ్కుమార్తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... 110లక్షల రూపాయాలతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. శంకర్పల్లి మున్సిపల్కు అధిక నిధులు మంజూరు చేసి మున్సిపల్ అభివృద్ధికి పాటుపడుతానన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, జడ్పీటీసీ గోవిందమ్మగోపాల్రెడ్డి, సోసైటి చైర్మెన్ బద్దం శశిదర్రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ బి.వెంకట్రాంరెడ్డి, టీఆర్ఎస్ మండల మున్సిపల్ అధ్యక్షులు గోపాల్, వాసుదేవ్కన్నా, కౌన్సిలర్లు సంతోష్, చంద్రమౌళి, లావణ్యశ్రీనివాస్రెడ్డి, సి.హెచ్ ఆశోక్, రాధాబాలకృష్ణ, కోఆప్షన్ సభ్యులు మహ్మద్, వెంకట్రెడ్డి, మాజీ జడ్పీటీసీ విఠలయ్య, మహేందర్రెడ్డి, లచయ్య, పాపారావు, శ్రీకాంత్రెడ్డి, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

## ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు.

**తాండూరు, నవంబరు 5, ప్రభాతవార్త:**
శాలివాహన డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఎంతో ఉత్సాహంగా స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. పట్టణంలోని తులసీగార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు నాగారం నర్సింలు, సీనియర్ సాఫ్ట్‌వేర్ శశిధర్, రామకృష్ణ పాలకమండలి నాయకులు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు తమ భవిష్యత్ కార్యచరణ ముందుగానే నిర్ణయించుకోవాలని సూచించారు. విద్యార్థులు చక్కగా చదువుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాక్షించారు. అనంతరం కళాశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కరస్పాండెంట్ అనురాధ, అకాడమిక్ డైరెక్టర్ సిద్ది లింగయ్య, వైస్ ప్రిన్సిపాల్ శరత్‌చంద్ర, రామకృష్ణ, కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాఘవేందర్

-జిల్లా అధ్యక్షుడు యాదయ్య



.నియమాకపత్రం అందిస్తున్న నాయకులు.

**బొంరాస్‌పేట్, నవంబర్5, ప్రభాతవార్త ః**
వికారాబాద్ జిల్లా అధ్యక్షులు జింకల యాదయ్య అధ్వర్యంలో అఖిల భారత యాదవ మహసభ వికారాబాద్ జిల్లా ఉపాధ్యాక్షులుగా దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన పూర రాఘవేందర్ యాదవ్‌కు నియమాక పత్రాన్ని అందజేయడం జరిగిందని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాముయాదవ్, పరిగి మండల అధ్యక్షులు విశ్వనాథ్‌యదవ్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు యాదవ్ పాల్గోన్నారు.

## ప్రజలు ఉచిత ఎక్స్‌రే క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా డిప్యూటీ డిఎంఎచ్ఓ రవీంద్రయాదవ్

**బొంరాస్‌పేట్, నవంబర్5, ప్రభాతవార్త ః**
బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం 7వ తేది నాడు ఉచిత ఎక్స్‌రే క్యాంపు నిర్వహించడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా డిప్యూటీ డిఎంఎచ్ఓ రవీంద్రయాదవ్, డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, దమ్ము ఉన్నవారు ఈ క్యాంపుకు వచ్చి ఎక్స్‌రేను ఉచితంగాచేయించుకోవాలని అన్నారు. ఈ క్యాంపు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఉంటుందన్నారు. దగ్గు, దమ్ము ఉన్నవారికి మాత్రమే ఉచిత క్యాంపు నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బందెప్ప కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయంను అందిస్తున్న ఉపాధ్యాయులు.

**బొంరాస్‌పేట్, నవంబర్ 5, ప్రభాతవార్త ః**
ఇటీవల రోడ్డుప్రమాదంలో అకాల మరణం చెందిన బందెప్ప టీచర్ కుటుంబానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బొంరాస్‌పేట్ మండలం తరపున శనివారం నాడు ఆర్థికసహాయం అందజేయడంజరిగిందని మండల అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. అయన మాట్లాడుతూ బందెప్ప టీచర్ మరణం వారి కుటుంబానికి వికారాబాద్ జిల్లా ఉపాధ్యాయులకు తీరని లోటు అన్నారు. వారి కుటుంబసభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. బందెప్ప సార్ కుటుంబానికి ప్రభుత్వం నుండి రావల్సిన బెనిఫిట్స్ అన్ని కూడా అందేలా ఉపాధ్యాయులు అందరం కలిసి సమిష్టిగా కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల ఉపాధ్యాక్షులు వెంకటేష్, ప్రధానకార్యదర్శి అనిత ఠాకూర్, కోశాధికారి సేవ్యానాయక్, క్లస్టర్ ఎచ్ఎం పాపిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

## బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

-పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసిన టిఆర్ఎస్ నాయకులు

**పెద్దేముల్, నవంబరు 5, ప్రభాతవార్త:**
వికారాబాద్ జిల్లాలోని కెరెళ్ళి-బాచారం వద్ద జరిగిన రొడ్డు ప్రమాదంలో మృతిచెందిన భాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండంగా ఉంటుందని మండల టిఆర్ఎస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఇందర్‌చెడ్ రాజన్న, రుక్మాపూర్ మాజీ సర్పంచ్ రమేష్, ఉమాశంకర్, జిల్లా కోఆప్షన్ అధ్యక్షులు అక్బర్‌బాబా అన్నారు. తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని మదనంతాపూర్, రెగొండి గ్రామాలలోని భాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కొ కుటుంబానికి రూ. 5 వేల చొప్పున ఆరుగురి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రొడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందడం భాధకరమని, వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించే పథకాలను అందేలా కృషిచేస్తామని అన్నారు. భాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అడ్కిచెర్ల, మదనంతాపూర్, మారెపల్లితాండా సర్పంచ్‌లు జనార్ధన్‌రెడ్డి, గోవర్ధన్, పాండు, యంపిటిసి రవి రాథోడ్, రెగొండి ఉపసర్పంచ్ శివకుమార్, నాయకులు లక్ష్మన్ నాయక్, మాణ్యానాయక్, రాజు, బాలప్ప, యేసు, టి.యేసు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న టిఆర్ఎస్ నాయకులు

# అక్రమ కట్టడాన్ని వెంటనే నిలిపివేయాలని స్థానికుల ఆందోళన

-కోర్టు ఆదేశాలు ఉన్నా ...

-మున్సిపల్ అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదు



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏకే టౌన్ వాసులు, కమిషనర్‌కు ఫీర్యాదు చేస్తున్న బస్తీవాసులు

**శంషాబాద్ నవంబర్5, ప్రభాతవార్త :**
శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఏకే టౌన్ షిప్‌లో సొసైటికి కేటాయించిన స్థలంలో కొందరు వ్యక్తులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేశారు. ప్లాట్లు విక్రయించే సమయంలో కాలనీలో మందిర్ మసీదు చర్చి నిర్మాణం ఉండదని అందరూ మతాలకు అతీతంగా సోదర భావంతో కలిసి ఉంటామని చెప్పిన విక్రయదారులు మాట మార్చి ఇప్పుడు మసీదు నిర్మాణం చేపట్టారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో ప్రజలందరికి ఉపయోగపడే విధంగా కేటాయించిన స్థలంలో మసీదు నిర్మాణం చేపట్టడం పట్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనితో కాలనీ సంక్షేమ సంఘం తరపున కోర్డులో పిటిషన్ వేయగా ఆ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేయాలని ఆర్డర్ కూడా వచ్చినప్పటికి మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. కోర్డు ఆదేశాలను ధిక్కరించి నిర్మాణం చేపడుతుండడంతో గతంలో మున్సిపల్ అధికారులు ఈ భవనాన్ని సీజ్ చేశారని తెలియక నాలుగు రోజులుగా నిర్మాణం చేపట్టడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే కాలనీ స్థలంలో అక్రమ నిర్మాణం జరుగుతున్నదని దీన్ని వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఏకే టౌన్ షిప్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ఆడ మగ చిన్న పిల్లలు కలిసి నిరసన ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. తమ కాలనీలో మందిర్ ,మసీద్ చర్చి వద్దని అందరూ ప్రశాంతంగా ఉండే విధంగా అక్కడ ఏర్పాట్లు చేయాలని కోరారు. నిరసన ప్రదర్శనలో కాలనీ అధ్యక్షుడు నందకిషోర్ మాన్కర్, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, షేక్ మాభాష, ప్రధాన కార్యదర్శి కూచిపూడి గురుదేవ్ దత్త, మేడిశెట్టి రాఘవేందర్, దేవేందర్, సుధాకర్, జైపాల్ రెడ్డి, గోపి భాస్కర్ రెడ్డి, దత్తం రెడ్డి, అమర్జిత్ సింగ్, రఫీక్, తన్వీర్, సిమోన్ రెడ్డి, పాల్గొన్నారు.

**కమిషనర్ వివరణ :** ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలి వారితో మాట్లాడుతూ..వెంటనే పనులు నిలిపివేస్తామని వివరించారని తెలిపారు.

# పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలి

- తాండూరులో సమ్మెబాట పట్టిన మున్సిపల్ కార్మికులు

**తాండూరు, నవంబరు 5, ప్రభాతవార్త:**
ప్రభుత్వం 11వ పీఆర్సీ కింద పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో మున్సిపల్ కార్మికులు, సిబ్బంది సమ్మెబాట పట్టారు. ఏఐటియూసీ మున్సిపల్ స్టాఫ్ ఆండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆద్వర్యంలో శనివారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. మున్సిపల్‌లో పని చేస్తున్న 212మంది కార్మికులతో పాటు గత కొన్నేళ్లుగా వేతనాలు అందకా ఇబ్బందులు పడుతున్న 18మంది కార్మికులు సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని, పీఆర్సీని అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం 11వ పీఆర్సీకింద పెంచిన జీతాలను గత 16నెలలుగా అమలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీలలో అమలు చేసినా తాండూరులో మున్సిపాల్టీలో మాత్రం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. గతంలో ఇదే విషయమై సమ్మె చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామి ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు పెంచి వేతనాలను చెల్లించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కార్మికులకు పెంచిన వేతనాలు, పీఆర్సీని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు గోపాల్, అశోక్, శ్రీనివాస్, చిన్న, రమేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న కార్మికులు.

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న సంఘం జిల్లా నాయకులు

**కొడంగల్, నవంబర్ 5ప్రభాతవార్త**
కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రెండవ మహసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యూ.బుగ్గప్ప, ఎం.వెంకటయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఐబిలో సీఐటీయూ జిల్లా ఉపాద్యక్షులు బుస్స చంద్రయ్య, నాయకులు రమేష్‌బాబు, దస్తప్పలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 22,23 తేదిల్లో కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో రెండు రోజుల పాటు జిల్లా మహసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహసభలకు ముఖ్య అతిధులుగా రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా నాయకులు హజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలో నిరంతరం వ్యవసాయ కార్మికులు, పేదలు, రైతుల భూ సమస్యలు, అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, పోడు భూమి సమస్యలు, ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, డబుల్‌బెడ రూం, రైతు రుణమాఫీ తదితర ప్రజా సమస్యలు పరిష్కరించాలని సంఘం తరపున నిరంతరం పోరాటం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల పక్షపాతి సంఘమైన వ్యవసాయ కార్మిక సంఘం మహసభలకు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అభ్యుదయవాదులు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని కోరారు.

# భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామి పల్లకీ సేవ

**షాద్‌నగర్, నవంబర్ 5, (ప్రభాతవార్త) :**
షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ గ్రామ సమీపంలోని చౌడమ్మ గుట్ట వద్ద వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కారించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి శనివారం నిర్వహించే పల్లకీ సేవలో భక్తులు పాల్గొని భక్తిగీతాలు ఆలపిస్తూ పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు సోలీపూర్ మాజీ సర్పంచి, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం స్వామివారి పల్లకీ సేవ అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... భక్తుల విరాళాలతో దేవాలయం దినదినాభివృద్ధి చెందుతుందని, భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. కొరిన కోరికలు తీర్చే ఆంజనేయ స్వామి భక్తులను చల్లంగా చూస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం దాత పాతపల్లి రాంచంద్రారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడవ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్‌రాజు దంపతులు, కుమార్‌గౌడ్, వసంతరావు, పినపాక ప్రభాకర్, నరేందర్, అన్నారం రఘుగౌడ్, ప్రవీణ్‌యాదవ్, నారాయణ, శ్రీనివాస్, గడ్డమీది రమేష్, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, సతీష్, కృష్ణచారి, గోరియానాయక్, వీఆర్వో బచ్చన్న, సత్తయ్య, గణేష్, రమేష్ పాల్గొన్నారు.



స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

## కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న కరస్పాండెంట్

**కొడంగల్, నవంబర్ 5ప్రభాతవార్త**
కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని లాహోటీ జూనియర్, డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హజరైన కళాశాల కరస్పాండెంట్ మల్లేష్‌యాదవ్ మాట్లాడుతు విద్యార్థులకు జీవితంలో కళాశాల ఓ మైలు రాయి వంటిదని, జీవితాన్ని నిర్దేశించుకునేది కళాశాలేనని అన్నారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తు ఏకాగ్రత, పట్టుదలతో చదవి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లాహోటీ విద్యాసంస్థల అధినేత పున్నంచంద్ లాహోటీ, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌యాదవ్‌లతో పాటు కళాశాల ఉద్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 7న హిందూవాహిని ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం

**కొడంగల్, నవంబర్ 5 ప్రభాతవార్త :**
పట్టణంలోని శ్రీమహదేవుని ఆలయ ఆవరణలో సోమవారం సాయంత్రం 6గంటల నుంచి కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హిందూవాహిని శాఖ సభ్యులు తెలిపారు. మహిళలు, చిన్నారులు, భక్తులు, హిందూవాహిని సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని దీపోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అన్నదాన కార్యక్రమ దృశ్యం

**యాచారం, నవంబర్ 5 ప్రభాతవార్త**
శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 414వ జన్మదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలోని బ్రహ్మం గారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రాజు నాయక్ ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు, యజ్ఞం, హోమం, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజునాయక్ మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీర్వాదంతో గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మారోజు వెంకటాచారి, ఆంజనేయులు, బ్రహ్మాచారి, శ్రీమన్నారాయణ చారి, భోజచారి, వెంకటరమణ, యాదగిరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీ కొట్టిన టిప్పర్... వ్యక్తి మృతి

**జిల్లెడు చౌదరిగూడ, నవంబర్ 5,(ప్రభాతవార్త):**
ఆగివున్న బైక్‌ను టిప్పర్ ఢీ కొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జిల్లెడు చౌదరిగూడ మండలంలోని తూంపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పూడురు మండలం కంకల్ గ్రామానికి చెందిన సురేందర్(23) కొందుర్గు మండలం మహాదేవ్‌పూర్ గ్రామంలో తన పెద్ద నాన్న అంత్యక్రియలకు వచ్చాడు. అంత్యక్రియల కార్యక్రమాలు పూర్తి చేసుకున్న సురేందర్ శనివారం చౌదరిగూడ వెళ్లేందుకు తన బైక్ వచ్చాడు. ఫోన్ రావడంతో తూంపల్లి గ్రామ సమీపంలో బైక్ ఆపుకుని ఫోన్ మాట్లాడుతుండగ వెనకాల నుంచి వచ్చిన టిప్పర్ సురేందర్‌ను ఢీ కొట్టింది. దీంతో సురేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

## క్రీడా ప్రాంగణాల పనులను త్వరగా పూర్తి చేయాలి

-డిఆర్‌డిఓ పీడి క్రిష్ణన్



నర్సరీని పరిశీలిస్తున్న డిఆర్‌డిఓ పీడి క్రిష్ణన్

**పెద్దేముల్, నవంబరు 5, ప్రభాతవార్త:**
గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాల పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని డిఆర్‌డిఓ క్రిష్ణన్ అధికారులకు ఆదేశించారు. శనివారం పెద్దేముల్ మండలంలోని గిర్మాపూర్, హన్మాపూర్, బుద్దారం గ్రామాలలోని నర్సరీలను, క్రీడా ప్రాంగణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్రిష్ణన్ మాట్లాడుతూ నర్సరీల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు వచ్చె ఏడాది వరకు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. 37 గ్రామ పంచాయతీలలోని ప్రతి నర్సరీలో 4500 మొక్కలను పెంచె విధంగా చూడాలని అన్నారు. మొక్కలను పెంచడమే కాకుండా వాటిని సంరక్షించే భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ లక్ష్మప్ప, యంపిఓ సుష్మ, గిర్మాపూర్, హన్మాపూర్, బుద్దారం గ్రామాల సర్పంచ్‌లు విజయమ్మ, సుమలత, లక్ష్మి, ఉపాధిహమి ఈసి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సాగు చేపట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా రైతు సమితి అధ్యక్షుడు నందారెడ్డి

**మేడ్చల్, నవంబర్ 5. ప్రభాతవార్త ః**
ఆరుతడి పంటల సాగు చేపట్టి రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించాలని జిల్లా రైతు సమతి అధ్యక్షుడు నారెడ్డి అన్నాడు. మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామంలో ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉద్యాన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వరి పంటలకు బదులుగా అధికాదాయం వచ్చే పండ్లు, కూరగాయల పంట సాగు చేపట్టాలని సూచించారు. నగరానికి అనుకుని ఉన్న మేడ్చల్ జిల్లా రైతులకు పండ్ల, కూరగాయాల విక్రయానికి మార్కెట్ అనుకూలంగా ఉంటుందన్నారు. డిమాండ్ ఉన్న పంటలు వేస్తేనే లాభదాయకంగా ఉంటుందని, అందుకనుణంగా ఉన్న పంటలను ఎంచుకుని రైతులు సాగు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జడ్పిటీసీ శైలజరెడ్డి, పూడూర్ సహకార సంఘం చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మేడ్చల్ మండల రైతు సమితి అధ్యక్షుడు బలరాంరెడ్డి, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరశ్రమ శాఖ అధికారిని నీరజ, ఉద్యాన అధికారిని రేణుక, డైరెక్టర్లు, భ్యాంకు అధికారి, రైతులు పాల్గొన్నారు.

## భారత్ జోడో యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



యాత్రలో ఉన్న నేతలతో మేడ్చల్ యువజన కాంగ్రెస్ నాయకులు

**మేడ్చల్, నవంబర్ 5. ప్రభాతవార్త ః** రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో మేడ్చల్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఆ పార్టీ మేడ్చల్‌కు చెందిన యువజన కాంగ్రెస్ నేతలు లక్ష్మన్, శ్రీనివాస్ తదితరులు తెలంగాణలో కొనసాగుతున్న ఈ యాత్రలో శనివారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్రలో వారు నేతల వెంట నడిచారు.

## ఆధ్యాత్మికచింతనతో మనసుకు ప్రశాంతత



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**శంకర్‌పల్లి, నవంబర్ 5, ప్రభాతవార్త :**
అయ్యప్ప దీక్ష నియమ నిబంధనలు పాటించి 40రోజులు దీక్ష చేయడంతో మనసుకు ప్రశాంతత దొరకుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శనివారం శంకర్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప మందిరంలో అయ్యప్ప స్వామి పూజలు ఘనంగా జరిగాయి. టీఆర్ఎస్ మున్సిపల్ యూత్ ప్రెసిడెంట్ జూలకంటి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.... అయ్యప్ప మాలధరణ స్వాములు ఎంతో నియమ నిబంధనలతో 40రోజులు దీక్ష చేసి అతర్వాత అయ్యప్ప దర్శనానికి వెళ్తారన్నారు. దేవుని సన్నిదిలోనే మనసుకు ప్రశాంతత దొరుకుతుందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మిప్రవీణ్‌కుమార్, జడ్పీటీసీ గోవిందమ్మగోపాల్‌రెడ్డి, సొసైటి చైర్మెన్ బద్ధం శశిదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ బి.వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు శ్వేతపాండురంగారెడ్డి, పార్శి రాధబాలకృష్ణ, లక్ష్మమ్మ, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

## రసాయన ఎరువులను నిబంధనల ప్రకారం విక్రయించాలి : ఏవో సందీప్ కుమార్

**యాచారం, నవంబర్ 5 ప్రభాతవార్త**
రసాయన ఎరువులను ఫర్టిలైజర్ షాపుల యజమానులు నిబంధనల ప్రకారం రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచించారు. శనివారం యాచారం మండల కేంద్రంలో ఉన్న ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులను ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం రూపొందించిన ధరలకే ఫర్టిలైజర్ యజమానులు ఎరువులను అమ్మాలని సూచించారు. ఎరువులను ఎవరైనా కొనుగోలు చేస్తే రశీదులు తప్పకుండా రాసి ఇవ్వాలన్నారు. మందులను అధిక ధరలకు అమ్మితే షాపును సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.



ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఏవో సందీప్‌కుమార్